నమస్తే తెలంగాణ
రంగారెడ్డి
I | హైదరాబాద్, శనివారం 19 అక్టోబర్ 2024 | RANGAREDDY

కాశన్నకుంటలో మృత్యువాత పడి నీటిపై తేలిన చేపలు

కాశన్నకుంటలో చేపలు మృత్యువాత

పరిశ్రమల వల్ల జల కాలుష్యం

ఇరిగేషన్ అధికారులకు సమాచారమిచ్చిన మత్స్య కారులు స్పందించని పొల్యూషన్ బోర్డు

కొత్తూరు, అక్టోబర్ 18: పరిశ్రమల నుంచి వస్తున్న నీటి కాలుష్యంతో కాశన్న కుంటలో చేపలు మృతిచెందాయి. ఈ విషయాన్ని మత్స్యకారులు ఇరిగేషన్ అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వారు వచ్చి చేపలను పరిశీలించి పొల్యూషన్ బోర్డు అధికారులకు సమాచారమిస్తామని చెప్పారు. వివరాల్లోకి వెళితే కొత్తూరు పట్టణాన్ని ఆనుకొని కాశన్నకుంట ఉంది. ఈ కుంట చుట్టూ చాలా పరిశ్రమలు ఉన్నాయి. ఈ పరిశ్రమలను నుంచి వెలువడుతున్న కాలుష్య జలాల కారణంగా శుక్రవారం ఉదయం చేపలు పెద్ద ఎత్తున మృతి చెంది కన్పించాయి. దీంతో కొత్తూరుకు చెందిన మత్స్యకారులు ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఇరిగేషన్ డీఈ ప్రతిమ, ఏఈ రవీందర్ చెరువు దగ్గరకు వెళ్లి పరిశీలించారు. వారు పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ అధికారులకు సమాచారమిస్తామని మత్స్యకారులకు తెలిపారు.

కాలుష్యం బారిన చెరువులు..

కొత్తూరులో చాలా పరిశ్రమలు జల, వాయు కాలుష్యాన్ని వెదజల్లుతున్నాయి. దీని వల్ల కొత్తూరు మున్సిపాలిటీలోని చాలా చెరువులు కాలుష్యం బారిన పడుతున్నాయి. అంతే కాకుండా స్పాంజ్ అండ్ ఐరన్ పరిశ్రమల నుంచి విపరీతమైన పొగ వెలువుడుతుంది. దీంతో అక్కడ పనిచేసే కార్మికులతో పాటు కొత్తూరు పట్టణ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయాన్ని పలుమార్లు పొల్యూషన్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారి స్పందించడంలేదు. పొగవల్ల తమ పంటలు పాడవుతున్నాయని చాలా మంది రైతులు పొల్యూషన్ బోర్డుకు విన్నవించినా పట్టించుకోవడంలేదని చెబుతున్నారు.

ఎత్తని చెత్తకు బిల్లులు రెడీ!

లెగసీ స్పెషల్ డ్రైవ్ పేరిట మరో దందా

సిటీబ్యూరో, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ): వ్యర్థాల నిర్వహణలో జీహెచ్ఎంసీ అభాసుపాలవుతున్నది. అధికార పార్టీ కార్పొరేటర్లే బల్దియా విధానాలను తప్పుపడుతున్నారు. పారిశుధ్య నిర్వహణలో అక్రమాల కట్టడిలో వైఫల్యం చెందిన యంత్రాంగం..తాజాగా లెగసీ వేస్ట్ (పాత చెత్త) తొలగింపునకు స్పెషల్ డ్రైవ్‌కు శ్రీకారం చుట్టింది. తొలి విడత ఈ నెల 16 నుంచి 22 వరకు చేపట్టేందుకు రంగంలోకి దిగింది. ప్రతి సర్కిల్‌కు రెండేసి వాహనాలతో ప్రత్యేక బృందాలు లెగసీ వేస్ట్ తరలింపు చేపట్టేందుకు తొలి రోజు హడావుడిగా కార్యక్రమాన్ని ప్రారంభించింది. కానీ చాలా సర్కిళ్లలో చెత్త తరలింపునకు వాహనాలు సమకూర్చలేదు. కొన్ని చోట్ల ఒక్క వాహనంతో సరిపెట్టారు. అదేమని అడిగితే రాంకీ సంస్థ ప్రతినిధులు వాహనాలు పంపలేదని క్షేత్రస్థాయిలో సమాధానాలు వస్తున్నాయి. దీంతో ప్రత్యేక ప్రణాళికలతో కాలనీలు, బస్తీల్లో వ్యర్థాలు, చెత్తాచెదారాన్ని తొలగించే పనులు నిలిచిపోవడంతో స్పెషల్ డ్రైవ్ విధానాన్ని స్థానిక ప్రజలే కాదు, స్వయంగా అధికార పార్టీ కార్పొరేటర్లు తప్పుపడుతున్నారు. శుక్రవారం మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ స్పెషల్ డ్రైవ్ విధానంలో లోపాలను సరిదిద్దాల్సిన అవసరం ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే అధికారులు మాత్రం ఈ నెల 21, 22 వ తేదీల్లో సీ అండ్ వ్యర్థాలు (భవన నిర్మాణ) తొలగిస్తామని చెబుతున్నారు. మొత్తంగా తొలి దశలోనే అభాసుపాలు కావడం, రెండో దశలో ఈ నెల 23 నుంచి 29వరకు, మూడో దశలో నవంబర్ 2 నుంచి 8 వరకు ఏ మేర పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తారన్నది ప్రశ్నగా మారింది. సందెట్లో సడేమియాలా కొందరు చెత్తను ఎత్తకుండా ఎత్తినట్లు బిల్లులు పెట్టేందుకు సిద్ధమవుతున్నట్లు కార్మిక వర్గాలు ఆరోపిస్తున్నాయి.

అన్నదాతకు అండగా..

బీఆర్ఎస్ సమరశంఖం

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన ధోకాపై త్వరలో రైతు ధర్నా

హాజరు కానున్న బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు చేసిన అన్యాయం, మోసంపై వారికి అండగా ఉండి పోరాడేందుకు బీఆర్ఎస్ పార్టీ సమరశంఖం పూరించనుంది. రేవంత్ సర్కార్ పెట్టుబడి సాయానికి ఎగనామం పెట్టడం, రుణమాఫీలోనూ కొర్రీలు పెట్టి అర్హులకు అన్యాయం చేయడం, ధాన్యం కొనుగోళ్ల లో సమస్యలు, పత్తి కొనుగోళ్లను ప్రారంభించకపోవడంతో బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధరకు విక్రయిస్తూ నష్టపోతున్న అన్నదాతలకు అండగా నిలవాలని బీఆర్ఎస్ పార్టీ నిర్ణయించింది. నియోజకవర్గాల వారీగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో రైతు ధర్నా కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. అందులో భాగంగానే త్వరలో వికారాబాద్ నియోజకవర్గంలో రైతు ధర్నా జరుగనున్నది. దీనికి కేటీఆర్‌తో పాటు మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్, పెద్ద ఎత్తున రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు పాల్గొననున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతోపాటు మూసీ, నేవీ రాడార్ సెంటర్ ఏర్పాటుపై కేటీఆర్ గళమెత్తనున్నారు.

- వికారాబాద్, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ)

పెట్టుబడి సాయానికి ఎగనామం..

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో ఒక్క దానిని కూడా సక్రమంగా అమలు చేయడం లేదు. రైతుభరోసా పథకంలో భాగంగా ఎకరాకు రూ.15 వేల పెట్టుబడి సాయం ఇస్తామని చెప్పినా ఇప్పటికీ దాని ఊసేలేదు. గత యాసంగిలోనే రైతు భరోసాను ప్ర భుత్వం అమల్లోకి తీసుకొస్తుందని ఆశించిన రైతులకు భంగపాటే ఎదురైంది. ఎకరాకు రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందించి చేతులు దులుపుకొన్నది. వానకాలంలో రైతు భరోసాపై ఎలాంటి ప్రస్తావన లేకపోవడంతో అన్నదాతలు వడ్డీ వ్యాపారుల వద్ద అధిక వడ్డీకి అప్పులు తీసుకొచ్చి విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి పంటలను సాగు చేశారు. నమ్మి గెలిపించినందుకు కాంగ్రెస్ ప్రభుత్వం నిలువునా మోసి చేసిందంటూ అన్నదాతలు దుమ్మెత్తి పోస్తున్నారు. మరోవైపు రైతుబంధు పథకం కింద బీఆర్ఎస్ ప్రభుత్వం జిల్లాలోని రైతాంగానికి రూ.2,926 కోట్ల సాయాన్ని పెట్టుబడి నిమిత్తం అందజేసింది. 2018 వానకాలంలో 1,94, 833 మంది రైతులకు రూ.221 కోట్లు, యాసంగిలో 1,75,989 మందికి రూ. 206 కోట్లు, 2019 వానకాలంలో 1,78,998 మందికి రూ.255 కోట్లు, యాసంగిలో 1,71,824 మందికి రూ.194 కోట్లు, 2020 వానకాలంలో 2,113,341 మందికి రూ.297 కోట్లు, యాసంగిలో 2,19,264 మందికి రూ.301 కోట్లు, 2021 వానకాలంలో 2,25,438 మందికి రూ.300 కోట్లు, యాసంగిలో 2,24, 928 మందికి రూ.241 కోట్లు, 2022-23 వానకాలంలో 2,47,707 మందికి రూ.305 కోట్లు, యాసంగిలో 2,43,447 మందికి రూ.299 కోట్లు, 2023-24 వానకాలంలో 2,62,065 మంది రైతులకు రూ.307.47 కోట్ల పెట్టుబడి సాయా న్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో బీఆర్ఎస్ ప్రభుత్వం జమ చేసి ఆదుకున్నది.

కొందరికే రుణమాఫీ..

కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ అమలుకు పెట్టిన నిబంధనలు, కొర్రీలతో జిల్లాలోని కొంతమందికి మాత్రమే లబ్ధి చేకూరింది. బీఆర్ఎస్ హయాంలో రూ.లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తే 1,26,000 మంది రైతులకు లబ్ధి చేకూరితే, కాంగ్రెస్ ప్రభుత్వం విధించిన షరతులతో బీఆర్ఎస్ ప్రభుత్వంలో లబ్ధి పొందిన రైతుల్లో కనీసం సగం మందికి కూడా మాఫీ కాలేదు. పట్టాదారు పాసుపుస్తకాలను పరిగణనలోకి తీసుకొని బీఆర్ఎస్ ప్రభుత్వం రూ. లక్ష లోపు పంట రుణాలను మాఫీ చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడంతోనే దాదాపు లక్ష మంది రైతులు నష్టపోయారు. అయితే జిల్లాలో సుమారు 1,70,000 మంది రైతులు పంట రుణాలను తీసుకుంటే వారిలో 91,956 మంది రైతుల రుణాలే మాఫీ అయ్యాయి. అయితే మొదటి విడతలో రూ.లక్ష లోపు 46,633 మంది రైతులకు రూ.256.26 కోట్ల రుణమాఫీ కాగా, రెండో విడతలో రూ.లక్షన్నర లోపు 26,438 మందికి రూ.265.04 కోట్లు, చివరి విడతలో రూ.2 లక్షల లోపు 18,885 మందికి రూ.247.71 కోట్ల రుణాలు మాఫీ అయ్యాయి. కాగా తమ పంట రుణాలు మాఫీ కాలేదంటూ జిల్లాలో ఏర్పాటుచేసిన గ్రీవెన్స్ సెల్‌కు 6,729 మంది రైతుల నుంచి ఫిర్యాదులు వచ్చాయి. రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడం, ఒకరి ఆధార్‌నంబర్‌కు బదులు మరొకరి ఆధార్ ఎంట్రీ చేయడం, వడ్డీని కలపకుండా కేవలం రైతులు తీసుకున్న రుణాలను మాత్రమే ఎంట్రీ చేయ డం తదితర కారణాలతో జిల్లాలో దాదాపు 80,000 మంది రైతులకు రుణమాఫీ కాలేదు. మరోవైపు రూ.2 లక్షలకుపైగా రుణాలు ఉన్న రైతుల పరిస్థితి మరీ దారుణంగా తయారైనది. కటాఫ్ రుణానికి మించి ఉన్న రైతుల్లో చాలామంది ఇప్పటికే పైన ఉన్న మొత్తాన్ని చెల్లించినా ఎలాంటి స్పష్టత లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మా ఇంట్లో ముగ్గురు ఉంటే ఒక్కరికీ మాఫీ కాలేదు.

మా ఇంట్లో ముగ్గురం బ్యాంకు రుణాలు తీసుకుంటే ఒక్కరికీ మాఫీ కాలేదు. నా పేరున 1.5 ఎకరాల పొలం ఉండగా రూ.1, 20,000 రుణం తీసుకున్నా. ఇంద్రమ్మ పేరున రెండు ఎకరాలుండగా రూ. 1,60,000 రుణం, రాజేందర్ పేరున 1.08 ఎకరాల భూమి ఉండగా రూ. 80వేల రుణం ఉన్నది. గత కేసీఆర్ ప్రభుత్వంలో అందరి రుణాలు మాఫీ అయ్యాయి. ఇప్పుడు బీఆర్ఎస్ మా కోసం పోరాడుతున్నందుకు కొండంత ధైర్యం వస్తున్నది.

– మొగ్దుంపూర్ రాచప్ప, రైతు, బంట్వారం



రైతు భరోసా ఎప్పుడొస్తది ?

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా ఎప్పుడు వేస్తదో తెలియని పరిస్థితి. ఈసారి సాగుకు అప్పులు చేసినా. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఏడాదికి రెండు సార్లు పెట్టుబడి పైసలు వచ్చేవి. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. 'రైతుబంధు'కు ఎగనామం పెట్టింది. బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా నిలువడం సంతోషకరం. రైతులకు పాటుపడే బీఆర్ఎస్‌తో కలిసి ఈ దగాకోరు కాంగ్రెస్‌పై పోరాటం చేస్తం.

– పట్లోళ్ల బలవంత్‌రెడ్డి, కొత్లాపూర్, మర్పల్లి

కాంగ్రెస్ సర్కార్ మోసం చేసింది..

రుణమాఫీ చేస్తామని కాంగ్రెస్ సర్కార్ మోసం చేసింది. నాకు 24 గుంటల భూమి ఉన్నది. వికారాబాద్ కెనరా బ్యాంకులో రూ.34 వేల రుణం తీసుకున్నా. రెన్యూవల్ కూడా చేశా. కానీ మాఫీ కాలె. బ్యాంకు, వ్యవసాయాధికారుల దృష్టికి తీసుకెళ్లే తర్వాత వస్తుందంటున్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎప్పుడైనా రైతుల కోసం పని చేస్తది. కేసీఆర్ హయాంలో రైతులకు ఎలంటి ఇబ్బంది రాలె.

– సంద నర్సింహులు, కొంపల్లి, వికారాబాద్

రైతుభరోసా జాడే లేదు..

కాంగ్రెస్ ప్రభుత్వం రైతుభరోసా పథకంలో ఎకరానికి రూ.15 వేలు ఇస్తనన్నది. ఇప్పటికీ ఆ జాడే లేదు. పెట్టుబడికి లేక ఎన్నో ఇబ్బందులు పడినం. గతంలో కేసీఆర్ తంచన్‌గా పెట్టుబడి సాయం వేసేది. ఈ మోసపూరిత కాంగ్రెస్‌పై రైతుల తరపున బీఆర్ఎస్ కొట్లాడుతుండడం మాకు భరోసా వస్తున్నది. మా బాధలను అర్థం చేసుకునే బీఆర్ఎస్ పార్టీ వెంటే మేము ఉంటాం. ఇప్పటికైనా కాంగ్రెస్ సర్కార్ పెట్టుబడి సాయాన్ని రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తే మంచింది.

– ఎండీ ఖాజాపాషా, రైతు, బంట్వారం

మాఫీ..ఫికర్!

జిల్లా రైతులకు రుణమాఫీ ఫికర్ పట్టుకున్నది. రుణమాఫీ ప్రక్రియ నేటికీ కొనసాగుతూనే ఉన్నది. అర్హులందరికీ పంట రుణాలను మాఫీ చేస్తామన్న కాంగ్రెస్ సర్కారు మూడు విడతల్లో సగం మందికే మాఫీ చేసింది. కేవలం రేషన్ కార్డులేక మాఫీ కాని రైతులే జిల్లాలో 20,445 మంది వరకు ఉన్నారు. ఇందుకు సంబంధించిన కుటుంబ నిర్ధారణ సర్వే నత్తనడకన సాగుతున్నది. కాలయాపన తప్పితే..మాఫీ అవుతుందన్న నమ్మకం జిల్లా రైతులకు కలగడం లేదు. మాఫీ కాక..కొత్తగా రుణా లు అందక..ఖరీఫ్ సీజన్ అప్పులతోనే భారంగా సాగింది.

-రంగారెడ్డి, అక్టోబర్ 18 (నమస్తే తెలంగాణ)

అన్నదాతల అయోమయం..

రూ.2 లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేస్తామని ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించడంతో రైతులంతా సంబురపడ్డారు. అయితే అధికారంలోకి వచ్చాక సర్కారు రకరకాల కొర్రీలు పెట్టడంతో చాలా మంది నిరాశ చెందారు. ప్రభుత్వం ఇప్పటివరకు మూడు విడతల్లో జిల్లాలోని 87,612 మంది రైతులకు రూ. 660. 72 కోట్ల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. అర్హత ఉన్నా చాలామందికి రుణ మాఫీ కాలేదు. రేషన్ కార్డులేకపోవడం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతాల్లో పేర్లలో పొరపాట్లు ఉండడం తదితర కారణాలతో వేలాది మందికి లబ్ధి చేకూరలేదు. మాఫీ కాని వారు వ్యవసాయ శాఖ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ఇంకా ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు. వానకాలం సాగుకు రైతు భరోసా వస్తుందని ఎదురు చూసిన రైతులకు ఆశాభంగమే కలిగింది. కనీసం రుణ మాఫీ అయినా..కొత్త రుణా లు తీసుకోవచ్చని భావించినా అడియాశే అయింది. రుణం మాఫీ కాక..కొత్తగా రుణాలు అందకపోవడంతో ప్రైవేట్ వ్యక్తుల వద్ద అధిక వడ్డీలకు అప్పు తెచ్చి సేద్యం చేశారు. ఖరీఫ్ సాగు గతంతో పోలిస్తే కాస్త తగ్గేందుకు కారణం ఇదేనని రైతులు చెబుతున్నారు.

నత్తనడకన కుటుంబ సర్వే..

32 రకాల కారణాలతో చాలామందికి రుణమాఫీ వర్తించలేదు. ఆయా సమస్యలను పరిష్కరించి అర్హులకు రుణమాఫీ అయ్యేలా చూస్తామని సర్కారు హామీ ఇచ్చింది. సాంకేతిక సమస్యల పరిష్కారానికి అధికారులు జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ సెల్ ఏ ర్పాటు చేసి ఫిర్యాదులు స్వీకరించారు. రేషన్ కార్డులేని వారికోసం కుటుంబ నిర్ధా రణ సర్వేను ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా జరిపిన ఈ సర్వేలో రేషన్ కార్డులేని 20,445 మంది రైతులను వ్యవసాయ అధికారులు గుర్తించి వివరాలు సేకరిస్తున్నా రు. ఇంటింటికెళ్లి వివరాలు తెలుసుకుని యాప్‌లో ఎంట్రీ చేస్తున్నారు. కుటుంబ యజమానితో ధ్రువీకరణ పత్రాన్ని తీసుకుంటున్నారు. వారం లోగా సర్వే పూర్తి చేసి రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తామని అప్పట్లో ప్రభుత్వం ప్రకటించింది. కానీ.. రెండు నెలలు దాటినా సర్వే పూర్తి కాలేదు. ఇప్పటివరకు 16,613 మంది రైతులకు సంబంధించి సర్వే పూర్తి చేసినట్లు అధికారులు చెబుతున్నారు. ఇంకా సర్వే కొన సాగుతూనే ఉన్నది. నెలల గడుస్తున్నా రుణ మాఫీపై స్పష్టత రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇక బ్యాంకుల్లో రూ.2 లక్షలకు పైగా రుణాలు తీసుకున్న వారి విషయంలోనూ ప్రభుత్వం ఇప్పటికీ స్పష్టత ఇవ్వలేదు. రూ.2 లక్షలకు పైగా ఉన్న మొత్తాన్ని చెల్లిస్తేనే మిగతాది మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ..ఆ మొత్తం చెల్లించాక మాఫీ అవుతుందా? లేదా? అనే మీమాసం రైతులను వెంటాడుతున్నది.

- అర్హులందరికీ పంట రుణాలు మాఫీ చేస్తామన్న సర్కారు
- మూడు విడతల్లో సగం మందికే లబ్ధి
- రేషన్ కార్డులేక మాఫీ కాని రైతులు రంగారెడ్డి జిల్లాలో 20,445 మంది
- అందని రైతుభరోసా.. అప్పులు తెచ్చి పంటల సాగు
- నత్తనతకన సాగుతున్న కుటుంబ నిర్ధారణ సర్వే
- నెలలు గడుస్తున్నా..ఒడవని మాఫీ ప్రక్రియ
- ఆందోళ నలో జిల్లా రైతాంగం

రేషన్ కార్డులేక రుణమాఫీకాని వారి వివరాలు మండలాల వారీగా..

మండలం	రైతులు
అబ్దుల్లాపూర్‌మెట్	488
ఆమనగల్లు	822
బాలాపూర్	126
చేవెళ్ల	1,176
ఫరూఖ్‌నగర్	1,239
గండిపేట	46
హయత్ నగర్	12
ఇబ్రహీంపట్నం	1,787
చౌదరిగూడెం	510
కడ్తాల్	777
కందుకూరు	1,700
కేశంపేట	1,163
కొందుర్గు	673
కొత్తూరు	324
మాడ్గుల	1,560
మహేశ్వరం	793
మంచాల	1,240
మొయినాబాద్	647
నందిగామ	367
సరూర్ నగర్	04
శేరిలింగంపల్లి	18
షాబాద్	729
శంషాబాద్	516
శంకర్‌పల్లి	666
తలకొండపల్లి	1,604
యాచారం	1,458
మొత్తం	20,445